గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే అజెండా

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు


చినకొత్తలంకలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్దే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అజెండా అని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేశారు. అనాతవరంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, చినకొత్తలంకలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని, గాడిలంకలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, కర్రివాని రేవులో రూ.62.73 లక్షలతో నిర్మించిన మంచి నీటి పథకాన్ని, కొత్తలంక గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనాతవరంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.1.86 కోట్లతో మంచినీటి పథకానికి, క్రాపచింతలపూడి పాలంలో రూ.28 లక్షలతో చేపట్టిన మంచినీటి పథకానికి, తానేల్లంకలో రూ.96 లక్షలతో నిర్మించే మంచి నీటి పథకానికి, అన్నంపల్లిలో రూ.22.80 లక్షలతో నిర్మించనున్న మంచినీటి పథకాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చినకొత్తలంకలో జరిగిన సభలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పేద కుటుంబాల్లో వెలుగులు నింపడమే ప్రథమ కర్తవ్యంగా భావించి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.కమలకుమారి, ఎంపీపీ కోలా గంగా భవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకర రావు, సర్పంచ్‌లు పొత్తూరి ఉమారాణి, విత్తనాల వీరనాగ బ్రహ్మేశ్వరరావు, మట్టపర్తి సత్యనారాయణ, పెద్దిరెడ్డి మునీంద్రరావు, కాశి భాగ్యలక్ష్మి, నక్కా విజయరాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జీ, జగతా పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దు

సర్వ సభ్య సమావేశంలో ఎంపీపీ శేషగిరిరావు


సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు

అల్లవరం: రానున్న వేసవిలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ఆదేశించారు. ముందస్తుగానే స్టోరేజ్ ట్యాంక్‌ల్లో నీటిని నిల్వచేసుకుని పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన అధికారులు శాఖలవారీగా ప్రగతిని వివరించారు. డ్వాక్రా వ్యవస్థలో అవినీతి తారా స్థాయికి చేరిందని, సభ్యులను భయపెట్టి యానిమేటర్లు వసూళ్లకు పాల్పడుతున్నా వెలుగు అధికారులు యానిమేటర్లపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని సర్పంచ్‌లు దాకారపు చిరంజీవి, సాధనాల వెంకటరావు, రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వర రావు మండిపడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పంపిణీ చేస్తున్న తాగునీటిలో నాణ్యత లోపిస్తుందని మరికొందరు సభ్యులు లేవనెత్తారు. దాళ్వా సీజన్లో 4,300 ఎకరాల్లో వరి నాట్లు వేశారని, నాట్లు వేసిన వరి క్షేత్రాల్లో ఈ–క్రాప్ నమోదు పూర్తి చేశామని, ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ చెప్పారు. సాగునీరు వృథాగా పోకుండా శివారు ప్రాంతాల్లో క్రాస్ బండ్లు వేస్తున్నామని డీఏ సునీతాదేవి తెలిపారు. దాళ్వాలో పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ ఏఈ రెహమాన్ అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ సభ్యులు మౌనిక, రాజేశ్వరి, శ్రీశాంతిభవాని, పద్మ, రంగనాథస్వామి, మామిడిశెట్టి శ్రీనివాసరావు, ముత్తాబత్తుల రాంబాబు, కాంత్రేగుల వాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్పంచ్‌కు పరామర్శ


సర్పంచ్ అరుణను పరామర్శిస్తున్న ఎంపీ చింతా అనురాధ

అమలాపురం రూరల్: అనారోగ్యంతో చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పేరూరు సర్పంచ్ దాసరి అరుణను ఎంపీ చింతా అనురాధ మంగళవారం పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వెంట ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ చొల్లంగి సుబ్బిరామ్, దొంగ అంజనేయులు, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా రుద్ర హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పరమ శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. తొలుత గణపతి పూజ, మండపారాధన, పూర్ణాహుతి జరిపారు. రుద్ర హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తెప్పోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఐ.పోలవరం: మహాశివరాత్రి సందర్భంగా వచ్చే నెల 12న మురమళ్ల వృద్ధ గౌతమీ గోదావరిలో జరగనున్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి తెప్పోత్సవ ఏర్పాట్లను ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు మంగళవారం పర్యవేక్షించారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, సర్పంచ్ కాశీ రాజుబాబు, కె.గంగబాబు పుష్కర ఘాట్‌ను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ చైర్మన్ వాసురాజు పేర్కొన్నారు.

ఘనంగా సత్యనారాయణ వ్రతం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో నిర్వహిస్తున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగంలో పదకొండో రోజు భీష్మ ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఋత్విక బృందం ఆరుద్ర నక్షత్ర జాతకులచే చింత చెట్టుకు పూజలు చేయించారు. అనంతరం గోపూజ నిర్వహించారు.

శివరాత్రి వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో భీమేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి 11 వరకూ శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు వివరించారు. కార్యక్రమంలో అరిగెల నానాజీ, సుంకర బుజ్జి, సలాది శివాజీ, మద్దింశెట్టి శివయ్య, చీకట్ల ఏసు, పైబోడి వీరేంద్ర, సలాది రాంబాబు, మంచెం బుజ్జి పాల్గొన్నారు.


వలంటీర్లకు సత్కారం

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం సచివాలయంలో వలంటీర్‌లకు వందనం కార్యక్రమంలో భాగంగా సేవా మిత్రలుగా ఎంపికైన వలంటీర్లను సర్పంచ్ కుంచే బుల్లియ్య దుశ్శాలువాలతో సత్కరించి ప్రభుత్వం ద్వారా వచ్చిన నగదు బహుమతులు అందజేశారు. అనంతరం వలంటీర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, కోరుకొండ కిరణ్, కుంచే స్వామి తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

ఐ.పోలవరం: ఈ నెల 23న రావులపాలెంలో జరగనున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల సమీక్షా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి మాదిగ పిలుపునిచ్చారు. మురమళ్లలో మంగళవారం జరిగిన ఐ.పోలవరం మండల ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉందుర్తి కిషోర్‌బాబు, ముమ్మిడివరపు విక్రమ్, సవరపు రత్నరాజు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణం


కోరంగిలో వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లరేవు: కోరంగిలో చారిత్రక శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పెద్దింటి శేషాచార్యులు నేతృత్వంలో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు

యానాం: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో యానాం లయన్స్ క్లబ్ పిల్లారాయకు నాలుగు అవార్డులు వచ్చినట్లు క్లబ్ అధ్యక్షుడు పులవర్తి శ్రీను మంగళవారం తెలిపారు. బీఆర్‌కే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ విజన్ ప్రోగ్రామ్ తదితర విభాగాల్లో అవార్డులను కార్యవర్గ సభ్యులు అందుకున్నారన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తత అవసరం


డాక్టర్ అభిషేక్‌వర్మ, డాక్టర్ విజయ్‌కుమార్‌లను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: ఆధునిక కాలంలో జీవనశైలి మార్పుల దృష్ట్యా ప్రతిఒక్కరూ గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని గుండె వైద్య నిపుణుడు డాక్టర్ జి.అభిషేక్ వర్మ సూచించారు. అమలాపురం సాయి సంజీవిని వాకర్స్ ఆరోగ్య సేవా సంస్థ స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సదస్సులో గుండె జబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ అభిషేక్ వర్మ ప్రసంగించారు. యువతలో ముఖ్యంగా పొగ తాగడం, గుట్కా తినడం వల్ల గుండె జబ్బులు అధికంగా వస్తున్నాయన్నారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు పాటించడంతో పాటు ఎప్పటికప్పుడు ఈసీజీ, కొల్రస్ట్రాల్ వంటి టెస్ట్‌లు చేయించుకోవాలని సూచించారు. ఎముకలు, కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.విజయకుమార్ మోకాళ్ల నొప్పులు, కీళ్ల వాతం అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యులు అభిషేక్‌వర్మ, విజయ్‌కుమార్‌లతో పాటు కవి నల్లా నరిసింహమూర్తిని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, వాకర్స్ ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, జిల్లా వాకర్స్ డిప్యూటీ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, నాగారపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


బాలల పరిరక్షణపై మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి

తాళ్లరేవు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ వంజరాన మాధవి తెలిపారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కులు, చట్టాలపై వీఓలు, వీఏలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాధవి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికలకు వివిధ రకాల ఆరోగ్య, శారీరక, మానసిక ఇబ్బందులు కలుగుతాయన్నారు. బాల్య వివాహాలకు పాల్పడిన వారికి రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తారన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్‌కి ఫోన్ చేసి చెప్పాలన్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులు పిల్లలను దత్తత తీసుకోవాలి అనుకుంటే స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి ద్వారా నిర్వహిస్తున్న శిశుగృహలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఏపీఎం రెడ్డి సన్యాసి రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


అంబేద్కర్ స్మారక భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: యువత అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సూచించారు. మండలంలో చినకొత్తలంకలో పీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో రూ.6 లక్షలతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మారక భవనాన్ని ఎమ్మెల్యే పొన్నాడ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, సర్పంచ్ పొత్తూరి ఉమారాణి, ఫౌండేషన్ సభ్యులు పీఎస్ సుబ్బరాజు, పీటీవీ వర్మ, పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి యానిమేటర్‌పై చర్యలేవీ?

అల్లవరం: స్త్రీ నిధి, ఉన్నతి సంఘాల్లో నిధులను దుర్వినియోగం చేసిన గూడాల–3 యానిమేటర్‌పై చర్యలు తీసుకోకుండా తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి డీఆర్‌డీఏ డీపీఎం జి.విజయకుమార్ ఆసక్తి చూపుతున్నారని సర్పంచ్ దాకారపు చిరంజీవి మండిపడ్డారు. మంగళవారం గూడాల సచివాలయం వద్ద గూడాల–3 కి కొత్త యానిమేటర్ నియామకం కోసం ఏపీఎం సయ్యద్ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ చిరంజీవి మాట్లాడుతూ గతంలో యానిమేటర్ స్త్రీ నిధి, ఉన్నతి ద్వారా రూ.3.44 లక్షల నిధులు దుర్వినియోగం చేసినట్లుగా డీపీఎం చేసిన విచారణలో నిగ్గు తేలిందని, అయినా సదరు యానిమేటర్ నుంచి నిధులు రికవరీ చేయడంతో అధికారులు విఫలమయ్యారన్నారు. ఇప్పుడు మళ్లీ అదే యానిమేటర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపించారు. డీఆర్‌డీఏ అధికారులు యానిమేటర్ నుంచి నిధులు రికవరీ చేసి చర్యలు తీసుకోకపోతే కోర్టుని ఆశ్రయిస్తానన్నారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ అనేష్ గౌడ్, ఏజీఎం ప్రసన్నలక్ష్మి, జల్లి సత్యనారాయణ, వెలుగు సిబ్బంది సత్తిబాబు పాల్గొన్నారు.

శ్మశానవాటికల అభివృద్ధికి నిధుల కేటాయింపు


శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్

అల్లవరం: అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి అవసరమైన శ్మశనవాటికల అభివృద్ధికి రూ.23 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులను ఎంపీ చింతా అనురాధ కేటాయించారని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. అల్లవరంలో రూ.3 లక్షల నిధులతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడికుదురు, తాండవపల్లి, కొత్తపేట, అంబాజీపేటల్లోని శ్మశానవాటికల అభివృద్ధికి రూ.5 లక్షలు చొప్పున నిధులను ఇచ్చారన్నారు. ఇవే కాకుండా మరో రూ.50 లక్షల నిధుల మంజూరుకు ప్రతిపాదనలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధకు వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మామిడికుదురు సర్పంచ్ గౌస్ మోహిద్దీన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎండీవై షరీఫ్, ఎండీ జాఫర్, సజ్జాద్, రబ్బానీ, కర్రార్ హుస్సేన్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామి తీర్థ మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో కాలభైరవస్వామి

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలోని సుబ్బారాయుడు దిమ్మ ప్రాంతంలో ఉన్న కాలభైరవ స్వామి తీర్థ మహోత్సవాన్ని స్థానిక శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీగణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. తీర్థ మహోత్సవంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

బోడసకుర్రు గ్రామాన్ని ఓఎన్‌జీసీ దత్తత తీసుకోవాలి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బోడసకుర్రు గ్రామస్తులు

అల్లవరం: చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థలు బోడసుకుర్రు గ్రామాభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నాయని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆరోపించారు. బోడసకుర్రులోని దేవర్లంకలోని గ్యాస్ కనెక్షన్ స్టేషన్ ముందు ప్లకార్డులతో మంగళవారం నిరసన తెలిపారు. బోడసకుర్రు గ్రామాన్ని దత్తత తీసుకుని రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాల కల్పనకు చమురు సంస్థలు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఓఎన్‌జీసీ కార్యకలాపాలతో మత్స్యకారులకు జీవనోపాధి కరువైతుందని వారికి పరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం గెయిల్ అధికారికి 12 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో చింతా శ్రీనివాస్, అడపా వెంకటేశ్వరరావు, ముత్యాల బాబి, దొమ్మేటి బావన్న, రొక్కాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లిలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 357 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 87 మందికి కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు గతంలో పరీక్షలు చేయించుకున్న 78 మందికి కళ్లజోళ్లను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, ఇసుకపట్ల రఘుబాబు, చీకురుమెల్లి సత్యనారాయణ, వైద్యులు లోవ సుధ, సోహెల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం


తాళ్లరేవులో అగ్నిప్రమాద బాధితుడికి సాయం అందిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: ఇటీవల తాళ్లరేవులో జరిగిన అగ్ని ప్రమాదంలో మట్టపర్తి తాతారావుకు చెందిన ఫ్యాన్సీ దుకాణం దగ్ధమైంది. బాధితుడు తాతారావుకు చింతా కృష్ణమూర్తి ఫౌండేషన్ సభ్యులు మంగళవారం సాయం పంపిణీ చేశారు. అమలాపురం ఎంపీ చింతా అనూరాధ టీం తీసుకొచ్చిన 50 కిలోల బియ్యం, దుస్తులు, ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ రాయుడు సునీత చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రత్స ముత్యాలు, యర్రంనీడి అప్పారావు, రాయుడు గంగాధర్, రెడ్డి రెడ్డిబాబు, చిట్టూరి చలపతి, బొంతు మోహన్, చింతా కృష్ణమూర్తి ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నసమారాధనకు విరాళం

యానాం: మాఘమాసం పర్వదినాన యానాంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని అన్నసమారాధన కోసం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం రూ.25వేలు విరాళాన్ని అందజేశారు. విరాళ మొత్తాన్ని అర్చకులు మానేపల్లి శివకు స్థానిక నాయకులు పులవర్తి శ్రీను అందించారు.

ఎఫ్–3 ప్రతినిధులకు సత్కారం

అమలాపురం టౌన్: మండలంలోని ఇమ్మిడివరప్పాడులో మదర్ థెరిస్సా వృద్ధాశ్రమానికి ప్రతి గురువారం క్రమం తప్పకుండా ఆహారాన్ని అందిస్తున్న స్థానిక ఎఫ్–3 ఫౌండేషన్ ప్రతినిధులను వృద్ధాశ్రమం 20వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని చర్చిలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఎఫ్–3 ఫౌండేషన్ ప్రతినిధులు పఠాన్ జానీ, నరేష్, మాలిమ్, ఆది, భరద్వాజలను వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు విక్టర్ సత్కరించి అభినందించారు. మూడేళ్లుగా వృద్ధాశ్రమానికి ప్రతి గురువారం ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేస్తున్నారంటూ ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

బేటీ బచావో.. బేటీ పఢావో

యానాం: ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలను చదివించండి అంటూ మంగళవారం స్థానిక ఇందిరాగాంధీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. సర్వ శిక్షా అభియాన్ ఏడీపీసీ ఇన్‌చార్జి పిల్లి రుద్రరామగోపాల్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష చూపకుండా వారిని చదువు వైపు మళ్లించేలా చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పీఎల్ ప్రవీణ్, హెచ్‌ఎం వీవీఎస్‌పీఎస్‌ఎన్ ఆచార్యులు, టీచర్లు పాల్గొన్నారు.

23న విద్యుత్ సరఫరా నిలిపివేత

యానాం: హెచ్‌టీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 23న యానాం నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ లంక కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

హోంగార్డు అభ్యర్థులకు శారీరక దారుఢ్య పరీక్షలు

యానాం: పుదుచ్చేరిలో 500 హోంగార్డు పోస్టుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న శారీరక దారుఢ్య పరీక్షలు మంగళవారం సైతం నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ నుంచి గోరిమేడు ఆర్మ్‌డ్ ఫోర్సెస్ గ్రౌండ్‌లో నిరంతరాయంగా ఫిట్‌నెస్ పరీక్షలు జరుగుతున్నాయి. మొత్తంగా 500 పోస్టులకు గాను యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల నుంచి 20,189 మంది దరఖాస్తు చేసుకున్నారు. దాంట్లో పురుషులు 15,697, మహిళలు 4,492 మంది ఉన్నారు. బుధవారం నుంచి మహిళా అభ్యర్థులకు శారీరక దారుఢ్య పరీక్షలు జరగనున్నాయి.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఉప్పలగుప్తం: మండంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తింటున్న మధ్యాహ్న భోజనాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు మంగళవారం పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసి విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్‌ఎం ఎల్.రాణి ఉన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో పాము హల్‌చల్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన గుత్తుల శ్రీను ఇంట్లోకి దూరిన పాము మంగళవారం సాయంత్రం అందరినీ హడలెత్తించింది. స్థానికులు కోరంగి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్నేక్ క్యాచర్ కునాల్ గోషల్ వచ్చి పామును చాకచక్యంగా పట్టుకుని బంధించి అభయారణ్యంలో విడిచిపెట్టారు. పాము జెర్రిగొడ్డు జాతికి చెందినదని అదంత ప్రమాదకరం కాదని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ధనుంజయ తెలిపారు.

ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

యానాం: యానాంను చూసేందుకు వచ్చిన వారిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడిన ఘటనకు సంబంధించి స్థానిక ఫ్రాన్స్‌తిప్ప గ్రామానికి చెందిన అరదాడి పోసియ్య, మేడా మణికంఠ, కొల్లు మరిడయ్యలను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మురుగనాథన్ మంగళవారం తెలిపారు. కాకినాడకు చెందిన మసకపల్లి నగేష్ తదితరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారు ముగ్గురిని అరెస్ట్ చేసి సబ్ కోర్టులో హాజరుపరిచామన్నారు.

పెట్రోల్ బంకు డీలర్లతో సమావేశం


పెట్రోల్ బంకు డీలర్లతో మాట్లాడుతున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: నియోజకవర్గ పరిధిలో పెట్రోల్ బంకు డీలర్లతో ఆర్‌ఏఓ మునిస్వామి సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీలర్స్ పెట్రోల్, డీజిల్ అమ్మకాలు, ట్యాంకర్ల ద్వారా దిగుమతికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. బంకుల యాజమాన్యాలు ఆయా కంపెనీలకు సంబంధించిన నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు వారాంతపు రిపోర్టులను ఆర్‌ఏఓ కార్యాలయానికి సమర్పించాలన్నారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బంకుల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు.